

సోమశిలలో 17.610 టీఎంసీలు

చేజర్ల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 17.610 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం 13,897 క్యూసెక్కులుగా ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,250
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,518
3శాతం జీఎస్టీతో	రూ.5,684
నవర (8గ్రా)	రూ.45,473

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /27.5

సోమవారం గాలిలో తేమ 75 శాతం ఉంది. మంగళవారం పలుచోట్ల జల్లులు, ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

దిశ కవచం

మీ భద్రతే మా బాధ్యత

చైతన్యం క్షేత్రస్థాయికి చేరుతోంది.. ఆశయం ఆచరణలోకి వస్తోంది.. వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంలా నిలుస్తోంది. బాలికలు, యువతులు, మహిళలు ఆకతాయిల నుంచి ఆపదవచ్చినా.. లైంగిక వేధింపులకు గురైనా.. అత్తింటి ఆరళ్లు ఎదుర్కొంటున్నా.. యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కుతున్నారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ కల్పిస్తున్నారు.



దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

అత్యవసర వేళల్లో అతివకు అండగా యాప్

- బటన్ నొక్కితే సత్వరమే పోలీసు రక్షణ
- ఇప్పటికే పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు
- యాప్‌కు పెరుగుతున్న ఆదరణ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో దిశ యాప్‌ను వినియోగించుకుని ఇప్పటికే పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు రక్షణ పొందారు. ఈ యాప్ ఇప్పటికే దేశంలోని అన్ని పోలీసు ఎమర్జెన్సీ సర్వీసుల్లో బెస్ట్ అండ్ ఫాస్టెస్ట్ సర్వీసుగా నిలిచింది.

- ఈ ఏడాది మే 20వ తేదీన బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన చెవుడు, మూగ కలిగిన వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటున్నాడని దిశ యాప్ ద్వారా కాల్ వచ్చింది. స్పందించిన పోలీసులు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. చావు సమస్యకు పరిష్కారం కాదని, పరిష్కారం లేని సమస్య ఏది లేదంటూ అతనికి కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.
- జూన్ 6వ తేదీ రాత్రి కందుకూరుకు చెందిన ఓ మహిళ భోగానం ఊరికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కందుకూరుకు చెందిన కరణ్, జోషి, ఫైరోజ్‌బాషాలు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధిత మహిళను సురక్షితంగా ఇంటివద్ద వదిలిపెట్టారు.
- జూన్ 26వ తేదీన ప్రకాశం జిల్లాకు చెందిన ఓ యువతి ఇంట్లో నుంచి అలిగి నెల్లూరుకు వచ్చింది. ఆర్టీసీ బస్టాండులో తిరుగుతుండగా అక్కడి వారు దిశ ఎస్‌ఓఎస్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. చిన్నబజారు పోలీసులు బస్టాండుకు చేరుకుని యువతిని విచారించారు. ఆమెను సఖి పోలీసుల ద్వారా బాధిత తల్లిదండ్రులకు అప్పగించారు.

ఇలా జిల్లా వ్యాప్తంగా బాధితులు దిశ యాప్ ద్వారా తమ పరిస్థితిని వివరిస్తున్నారు. పోలీసులు వేగంగా స్పందించి బాధితులకు రక్షణ కల్పిస్తున్నారు.

- దిశ ఎస్‌ఓఎస్ యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ సమయంలో మాత్రమే నెట్ అవసరం. ఆ తర్వాత నెట్ లేకపోయినప్పటికీ యాప్ పనిచేస్తుంది.
- వ్యక్తిగత వివరాలతో పాటు కుటుంబసభ్యులు, స్నేహితులకు సంబంధించిన ఐదు ఫోను నంబర్లను అందులో సేవ్ చేసుకోవాలి. ఆపదలో ఉన్నప్పుడు యాప్‌ను ఓపెన్‌చేసి అత్యవసర సహాయం(ఎస్‌ఓఎస్) బటన్ నొక్కాలి. బటన్ నొక్కే పరిస్థితి లేకపోతే ఫోన్‌ను వేగంగా అటూ ఇటూ ఊపితే ఫోన్ లొకేషన్ వివరాలు కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అదేక్రమంలో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కి ఆమె వాయిస్‌తో పాటు అక్కడ జరిగే దృశ్యాలను పది సెకన్ల నిడివి వరకు వీడియో తీసి పంపవచ్చు. దీంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని చర్యలు చేపడుతారు.

ఎనిమిది నెలల వ్యవధిలో

దిశ యాప్ రిజిస్ట్రేషన్‌లు:	11,682
దిశకు వచ్చిన కాల్స్:	1,142
కౌన్సెలింగ్‌లు:	1,122
ఎఫ్ఐఆర్‌లు:	20

- యాప్‌లోని ట్రాక్‌మై ట్రావెల్ ఆప్షన్ వినియోగిస్తే మీరు ప్రయాణిస్తున్న వాహనం మీ గమ్యానికి కాకుండా వేరే వైపు వెళ్తుంటే ఆ సమాచారం దిశ కంట్రోల్‌రూమ్‌తో పాటు ఫోన్‌లో నమోదైన ఐదు నంబర్లకు పంపి అప్రమత్తం చేస్తుంది.
- దగ్గరల్లోని మెటర్నటీ, ట్రామా కేర్ సెంటర్‌లు, ఇతర ఆస్పత్రులు, బ్లడ్‌బ్యాంకులు, ఫార్మసీలు తదితర వివరాలు దిశ ద్వారా తెలుసుకోవచ్చు.
- బాధితులు ఉన్న ప్రదేశానికి సమీప పోలీసుస్టేషన్, సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నావిగేషన్, పోలీసు డైరెక్టరీ, అత్యవసర సమయాల్లో ఫోను చేయాల్సిన నంబర్లు, సామాజిక మాధ్యమాలు, రోడ్డుభద్రత వంటి ఆప్షన్లు యాప్‌లో ఉన్నాయి.

దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంలా నిలుస్తోంది. యాప్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, మహిళా పోలీసులు తమ ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌లు, షాపింగ్‌మాల్స్, విద్యాసంస్థలు, రైల్వేస్టేషన్‌లు, బస్టాండులు, వాణిజ్య సముదాయాలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద యాప్ పనితీరు? ఆపద సమయంలో ఎలా వినియోగించుకోవాలి తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థినులు, యువతు లు, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి సెల్‌ఫోన్లలో యాప్‌ను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. గడిచిన ఎనిమిది నెలల్లో జిల్లా వ్యాప్తంగా 11,682 మంది యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

అందరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



ఎవరికి ఏ సమయంలో ఆపద వస్తుందో తెలియదు. నాకేం కాదని అనుకోవడం సరికాదు. ప్రతి మహిళా తన స్మార్ట్ ఫోన్‌లో దిశా యాప్‌ను విధిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో యాప్ ఆపన్న హస్తంలా పనిచేస్తుంది. ఆపదలో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కినా, ఫోన్‌ను అటూ ఇటూ ఊపినా నిమిషాల వ్యవధిలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్షిస్తారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది గృహిణిలు, ఉద్యోగినులు, యువతులు యాప్ ద్వారా గృహహింస, అసభ్య దూషణలు, బ్లాక్ మెయిల్. లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసి రక్షణ పొందారు.

– డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

టార్గెట్ గ్రేట్

చాట్ల అక్షయ్ మహదేవ్ అనే కుర్రవాడు విలువిద్యలో తన సత్తాను చాటుతున్నాడు. గురితప్పని సాధనతో విజయాలను తన విలువిద్యతో సొంతం చేసుకుని శభాష్ అనిపించుకుంటున్నాడు. సాధారణంగా పౌరాణిక సినిమాలు చూసే అలవాటున్న అక్షయ్ ఆ సినిమాల్లోని బాణాల వైపు ఆకర్షితుడయ్యాడు. అది గమనించిన తండ్రి ఆర్చరీలో శిక్షణను ఇప్పించడంతో అతనిని అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా చేసింది.



కొలంబోలో సాధించిన గోల్డ్ మెడల్, సర్టిఫికెట్

ఆర్చరీలో అక్షయ్ ప్రతిభ

- ఐదేళ్ల కెరియర్‌లో పలు మెడల్స్ సాధన
- రాష్ట్ర 7, జాతీయ 4, ఇంటర్నేషనల్ 2

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరంలోని మూలాపేటకు చెందిన చాట్ల రాజేష్, సుమలకు ఇద్దరు మగ పిల్లలు. ఇద్దరూ విలువిద్యల్లో రాణిస్తున్నారు. పెద్దబ్బాయి చాట్ల అక్షయ్ మహదేవ్ 2019లో విలువిద్య సాధన ప్రారంభించారు. 3వ తరగతిలో ప్రారంభమైన విలువిద్య 8వ తరగతికి వచ్చేసరికి అంతర్జాతీయ స్థాయికి చేరింది. ప్రారంభించిన ఏడాది నుంచి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో రాణించడం మొదలు పెట్టారు. ఐదేళ్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలను దాటి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. విలువిద్యలో మూడు సెగ్మెంట్లు ఉంటాయి. ఇండియన్ రౌండ్ సెగ్మెంట్ జాతీయ స్థాయిలో, రికార్వ్ సెగ్మెంట్ ఒలింపిక్స్‌లో, కాంపౌండ్ సెగ్మెంట్ అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తుంటారు. ఆకాష్ మహదేవ్ క్లిష్టతరమైన రికార్వ్ సెగ్మెంట్‌లో రాణించడం ప్రత్యేకం.

కాస్ట్లీ క్రీడ...

అంతర్జాతీయ స్థాయిలో ఆర్చరీలో రాణించాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. నెల్లూరులో ఆర్చరీకి తగిన ఆదరణ లేని సమయంలో అక్షయ్ మాధవ్ తాత చాట్ల నర్సింహారావు స్కూల్ డైరెక్టర్‌గా తన స్కూలు కోసం ఒక ఆర్చరీ అకాడమీని ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రమాణాల్లో ఒక విల్లు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు ఉంటుంది. బాణాలు రూ.12 వేలు, రూ.40 వేలు వరకు విలువ చేస్తాయి. ఇక టార్గెట్ పేస్‌లు, టార్గెట్ బట్టర్స్ ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడినవే. ఇప్పటి వరకు విజయవాడ, హైదరాబాదులకు పరిమితమైన ఈ ఆర్చరీ శిక్షణ నెల్లూరులో ప్రారంభం కావడంతో అక్షయ్‌కు కలిసి వచ్చింది. ఉదయం 5 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4.40 నుంచి 6.30 గంటల వరకు సాధన చేస్తూ ఏ ఏడాదికి ఆ ఏడాది జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతూ పాల్గొన్న ప్రతి పోటీల్లో పతకం సాధించేవాడు. ఖర్చు అధికమైనప్పటికీ స్కూల్లో పిల్లలు సైతం విలు విద్యలో రాణిస్తారని, ఏకాగ్రత సాధించగలుగుతారని స్కూల్ డైరెక్టర్ చాట్ల నర్సింహారావు తెలిపారు. అక్షయ్ మహదేవ్‌లో విలువిద్య క్రీడా ఆసక్తిని గమనించిన తండ్రి రాజేష్ శిక్షణ ఇప్పించేందుకు జార్ఖండ్ నుంచి దివ్య ప్రకాష్‌ను ఎంపిక చేసుకున్నారు. కోచ్ దివ్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఉదయం సాయంత్రం సాధనలు చేస్తున్నాడు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పావురాల వేణు, రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చేకూరి సత్యనారాయణలు మంచి సహాయ సహకారాలను అందచేస్తూ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు బాటలు వేస్తున్నారు.

పతకాలిలా...

2022వ సంవత్సరం నుంచి జరిగిన ప్రతి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అక్షయ్ ప్రతిభ కనపరిచారు. 2023 జూలైలో శ్రీలంకలో జరిగిన కొలంబో ఓపెన్ ఆర్చరీ ఇంటర్నేషనల్ పోటీల్లో అండర్–12 రికార్వ్ విభాగంలో గోల్డ్ మెడల్‌ను, 30 మీటర్ల ఓపెన్ రికార్వ్ పోటీల్లో సిల్వర్ మెడల్‌ను సాధించి అబ్బుర పరిచారు.



సాధన చేస్తున్న అక్షయ్ మహదేవ్

ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ లక్ష్యం

ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి దేశానికి పేరు తెస్తాను. చదువుల్లో రాణించి ఐఏఎస్ అధికారి కావాలన్నది కోరిక. ఉదయం సాయంత్రం సాధన చేస్తూ చదువుల్లో కూడా రాణిస్తాను. పోటీల్లో పాల్గొనడం వల్ల వివిధ క్రీడాకారుల ఆట తీరు, పలు ప్రాంతాల పరిస్థితులు అవగాహన చేసుకోవచ్చు. చదువుకుంటూనే ఇష్టమైన క్రీడల్లో రాణించవచ్చు. తాతయ్య, అమ్మ నాన్నలు, కోచ్‌లు మంచి ప్రోత్సాహం ఇస్తున్నారు.

– చాట్ల అక్షయ్ మహదేవ్

తొలగించిన ఓట్ల రీవెరిఫికేషన్ చేస్తున్నాం

- కలెక్టర్ హరినారాయణన్



తొలగించిన ఓట్ల రీ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

సంగం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో తొలగించిన ఓట్లను రీ వెరిఫికేషన్ చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. ఓటర్ల జాబితా నుంచి ఓటు తొలగించిన విషయమై క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ సోమవారం సంగం మండలం పడమటిపాళెం గ్రామంలో తనిఖీ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారిగా సంగం మండలం పడమటిపాళెంలో చనిపోయిన, రెండు ఓట్లు నమోదు అయిన వారి తొలగింపు, వేరే ప్రాంతాలలో నివాసం మార్చుకున్న వారి ఓట్ల తొలిగించడంపై వాస్తవ పరిస్థితులను కలెక్టర్ వారి ఇంటికి వెళ్లి పరిశీలించారు. చనిపోయారా, ఇక్కడ లేకుండా వేరే ప్రాంతాలకు వెళ్లారా అని కుటుంబసభ్యులను, పరిసర ప్రాంతాల వారిని ఆరా తీశారు. ఓటు తొలగించే ముందు వారి కుటుంబ సభ్యులకు తెలియచేశారా లేదా అని విచారించారు. మాకు తెలియచేసే మరణించిన వారి ఓటు తొలగించారని కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు తెలిపారు. 2022 జనవరి 6 నుండి 2023 జూలై 21 వరకు ఓటర్ల జాబితా నుంచి ఓటు తొలగించిన వారి విషయమై ఇప్పటికే 5 నియోజకవర్గాల్లో ర్యాండంగా తనిఖీ చేశామన్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఓట్లు తొలగించబడిన 10మంది ఇళ్లకు వెళ్లి తనిఖీ చేస్తున్నామని అన్నారు. ఓటరు వివరాల రికార్డులు భద్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, వీఆర్ఓ సప్తగిరి ఉన్నారు.

ప్రజలు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

- ఆ మేరకు అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం
- ఆత్మకూరులో 'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన

ఆత్మకూరు: ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇచ్చేవారు సంతృప్తి చెందేలా వాటిని పరిశీలించి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్న చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. కలెక్టర్ వందలాది మంది అర్జీదారుల నుంచి అర్జీలు తీసుకొని సంబంధిత అధికారులకు అందజేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యత వహించాలని ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. కొందరు అర్జీదారులు నిర్దేశించిన గడువు పూర్తికాకుండానే వస్తున్నారని గడువు పూర్తయ్యాక సమస్య పరిష్కారం కాకపోతే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ఓ దివ్యాంగుడు అర్జీ ఇచ్చేందుకు కార్యాలయానికి రాగా, కలెక్టర్ స్వయంగా అతని వద్దకు వెళ్లి అర్జీ తీసుకొని సమస్యను విన్నారు. ఆత్మకూరు డివిజన్‌లో వచ్చిన సమస్యలపై డివిజన్ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో స్పందన కార్యక్రమానికి వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు రావాల్సి ఉండడంతో తానే ఆత్మకూరుకు వచ్చి స్పందన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గ స్థాయిలో గత నెలలో రెవెన్యూ సమస్యలపై అధికారులతో సమావేశం నిర్వహించడంతో 30 శాతం సమస్యలు నియోజకవర్గం నుంచి తగ్గాయని కలెక్టర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో భూముల రీసర్వే పూర్తయితే సమస్యలు ఇంకా తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

కలెక్టర్ ఆత్మకూరు స్పందన కార్యక్రమానికి వచ్చే ముందుకు మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఓటర్ల వద్దకే వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల ఓట్లు తొలగించిన వాటిని ఆ కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన, నివాసాలు మార్చుకున్న వారి వివరాలను స్థానికుల వద్ద ఆరాతీశారు. గత ఏడాది జనవరి 6 నుంచి ఈ ఏడాది జూలై 21వ తేదీ వరకు ఓటరు జాబితా నుంచి ఓట్లు తొలగించిన వారి విషయమై ఇప్పటికే ఐదు నియోజకవర్గాల్లో ర్యాండమ్‌గా తనిఖీలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ సాధు కరుణకుమారి, డీటీ నాగరాజు, డీఎస్పీ ఎన్ కోటారెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారితో పాటు సెబ్, ఐసీడీఎస్, ఆర్టీసీ, వైద్య, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, రిజిస్ట్రార్, తదితర డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించాలి

నెల్లూరు రూరల్: టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు ఈనెల 5వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునని ఇన్‌చార్జ్ డీఈఓ నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

అర్హులందరికీ పింఛన్

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: టీడీపీ ప్రభుత్వంలో పింఛను పొందాలంటే జన్మభూమి కమిటీల వద్దకు వెళ్లాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితులు లేవని, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను మంజూరు చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం కొత్తగా మంజూరైన పింఛన్లను మంత్రి చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బడుగు, బలహీనవర్గాల పక్షపాతి అన్నారు. ప్రతి ఆరుమాసాలకొక పర్యాయం కొత్త పింఛన్లను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో నాడు-నేడు పనులు



పాఠశాల భవన నిర్మాణ పనులు పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి

వెంకటాచలం: నాడు-నేడు కింద జరుగుతున్న పాఠశాలల అదనపు గదులు, ప్రహరీలు, తదితర నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్నాయని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి పేర్కొన్నారు. వెంకటాచలం జెడ్పీ ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులు నాడు-నేడు పథకం కింద రూ.72 లక్షలతో నిర్మిస్తున్నారు. ఈ పనులను ఆమె సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు.

వీఎస్‌యూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



వీఎస్‌యూలో సమావేశమైన నూతన పాలక మండలి

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన వీఎస్‌యూ నూతన పాలకమండలి సభ్యులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీసీ సుందరవల్లి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, జరగాల్సిన పనులు, నియామకాలు తదితర అంశాలపై చర్చించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం నేడు

నెల్లూరు రూరల్: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అందజేయనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరుగైన విద్యా బోధనతో పాటు సేవా కార్యక్రమాలకు తోడ్పాటునందించిన ప్రభుత్వ పాఠశాలల్లోని హెచ్‌ఎంలకు, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేటగిరీలలో 50 మంది ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు. కోవూరు మండలంలోని ఇనమడుగు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం రాధారాణి, వింజమూరు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం మాల కొండయ్యలు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

• ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

వరికుంటపాడు: వేగంగా వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో ఓ మహిళ మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం వరికుంటపాడు మండలం జడదేవి సమీపంలో జరిగింది. వివరాలు.. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చీర్లదిన్నె గ్రామానికి చెందిన సయ్యద్ రసూల్ కుటుంబం గత ఎనిమిదేళ్లగా ఆత్మకూరు పట్టణంలో నివాసం ఉంటోంది. రసూల్ తన భార్య బీబీ, ఇతర కుటుంబసభ్యులతో కలిసి ఆత్మకూరు నుంచి స్వగ్రామమైన చీర్లదిన్నెకు పాడుపు నగదు తెచ్చుకునేందుకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో జడదేవి గ్రామ సమీపంలో గ్రామంలో నుంచి ఓ ట్రాక్టర్ జాతీయ రహదారిపైకి రావడంతో ఆటో దానిని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న దిమ్మెను ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో సయ్యద్ బీబీ(30) అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలోని మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై విజయ్‌శ్రీనివాస్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్సనిమిత్తం పామూరు వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. ప్రమాద స్థలాన్ని ఉదయగిరి సీఐ గిరిబాబు పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షేమానికి రోల్ మోడల్ సీఎం జగన్

• రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు


నూతన పింఛన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయాలకు రోల్ మోడల్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడవలూరులోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు కోరకుండానే వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అందిస్తున్న గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మంచి చేయడమే ముఖ్యమంత్రి అజెండా అన్నారు. సంక్షేమ పాలన ద్వారా ఇతర రాష్ట్రాల సీఎంలకు ఆదర్శంగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆయన ద్వారా మేలు జరిగిన వారంతా ఆయన్ను మరలా సీఎంను చేసుకోవాలని, అలాగే ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఒక పింఛనుదారు మృతిచెందితే తప్ప కొత్త పింఛన్ మంజూరయ్యేది కాదని, అలా చేయాలన్నా జన్మభూమి కమిటీలు స్క్రీనింగ్ చేసి పక్కన పెట్టేవని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో 39 లక్షల మందికి రూ.400 కోట్ల పింఛన్లు ఇస్తుంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 64 లక్షల మందికి రూ.1,565 కోట్లు పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు అందిస్తోందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేసి ప్రజల మనసుల్లో నిలిచిపోయారని, ప్రస్తుతం ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా వైఎస్సార్ బాటలోనే నడుస్తూ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లగా కనిపించని నాయకులు ఎన్నికలు సమీపిస్తుండగా వచ్చి సీఎంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకొని అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రిని మరలా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీ వేమిరెడ్డి రూ.50 వేల సాయం

మండలంలోని చంద్రశేఖరపురానికి చెందిన పి.డానియేల్‌కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. అతని కుమారుడు విక్రాంత్ కొద్దిరోజుల క్రితం ప్రమాదంలో మృతిచెందిన నేపథ్యంలో కొడవలూరులో సోమవారం డానియేల్‌కు రూ.50 వేల నగదు అందజేశారు.

కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, తహసీల్దార్ సీ రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్‌లు బి.సుప్రియ, కామాక్షి, నాయకులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు ఈ ఉపాధ్యాయుడు


డిప్యూటీ సీఎం, మంత్రి చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న కృపాల్ (ఫైల్)


తన ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయుడు కృపాల్ (ఫైల్)

ఆయనో ఉపాధ్యాయుడు.. ఓవైపు విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతూనే మరో వైపు తన ఫౌండేషన్ ద్వారా అనాథలను గుర్తించి వారికి సేవ చేస్తున్నారు. మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని అనాథలకు సేవలందిస్తున్న ఈ ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.జి.డి.కృపాల్‌ను పలువురు అభినందిస్తున్నారు.

• విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఇంగ్లిష్ టీచర్
• ఫౌండేషన్ ద్వారా అనాథలకు సేవ చేస్తున్న కృపాల్
• నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కథనం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పి.జి.డి.కృపాల్ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంలో దిట్ట. విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టుసాధించేలా సరళంగా విద్యను బోధించడం ఆయన నైజం. అంతేకాకుండా విద్యార్థుల్లోని సృజనాత్మకత, కళానైపుణ్యాలను గుర్తించి వారిలోని ప్రతిభను వెలికితీసేలా నృత్యాలు, ప్రదర్శనలు చేయిస్తుంటారు. అలాగే విద్యార్థులకు మంచి చేతి రాతపై శిక్షణ ఇస్తుంటారు.

ఉద్యోగంలో..

వరికుంటపాడు మండలం కాకొల్లువారిపాళెం గ్రామానికి చెందిన జ్ఞానసుందరం–కృపారవం దంపతులకు రెండో సంతానంగా జన్మించిన కృపాల్ 7వ తరగతిలోనే చదువులో మంచి ప్రతిభ చాటారు. అలాగే 10వ తరగతి, ఇంటర్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి, డిగ్రీ కావలిలోని జవహర్‌భారతి కళాశాలలో, అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివారు. అలాగే అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్‌ను పూర్తి చేశారు. అనంతరం 1996వ సంవత్సరంలో వెంకటాచలం మండలం నిడుగుంటపాళెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా విధుల్లో చేరాడు. 2007వ సంవత్సరంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ సందర్భంగా అందించే హైట్రీ అవార్డును ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మంత్రి ఆదిమూలపు సురేష్ చేతులమీదుగా అందుకున్నారు.

మదర్ థెరిసా ఆశయాలకు అనుగుణంగా..

పి.డి.జి.కృపాల్ మదర్ థెరిసా ఆశయాలకు అనుగుణంగా పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో 2020 సంవత్సరంలో అచర్విత ఫౌండేషన్‌ను స్థాపించారు. అనాథలకు బియ్యం, దుస్తులు, కూరగాయలు, ఇతర సామగ్రి ఉచితంగా అందిస్తూ సేవా కార్యక్రమాలను చేపట్టారు. కరోనా సమయంలోనూ పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి అండగా నిలిచారు. అలాగే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే వారికి, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు సాయం అందిస్తూ సేవాతత్పరులుగా నిలుస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 151
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 256
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 286
లేయర్ చికెన్	: 178

నిర్ణీత గడువు లోపు పరిష్కరించండి


బాధితురాలి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

• ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నిర్ణీత గడువు లోపు అర్జీదారుల సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, ఎంసెట్ కౌన్సెలింగ్ పేరిట మోసం, తల్లిదండ్రులపై పిల్లల వేధింపులు, భూ/ఆస్తి వివాదాలు, మిస్సింగ్, ప్రేమపేరిట మోసాలు తదితరాలపై 91 వినతులు అందాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదుల విషయంలో అలసత్వం తగదన్నారు. సత్వరమే కేసు విచారణ పూర్తి చేసి వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. వరకట్న హత్య, అనుమానాస్పద మరణాలు, మిస్సింగ్ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, డీటీసీ డీఎస్పీ శిరీష, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై తమను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు ఎస్పీని కోరారు. తామంతా ఎస్సీ, ఎస్టీలమని, ఇంటర్మీడియట్ పాసై ఎంసెట్–2023లో ర్యాంకులు సాధించామని తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌పై తమకు సరైన అవగాహన లేదని తెలుసుకున్న తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన రవి తాను సాయం చేస్తానని నమ్మించాడని తెలిపారు. వెబ్ ఆప్షన్స్‌లో ప్రభుత్వ యూనివర్సిటీల్లో తొలి ప్రాధాన్యత ఇచ్చి సీట్లు వచ్చేలా చేస్తానని చెప్పాడని, అందుకు భిన్నంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యలతో కుమ్మక్కై ఆ కళాశాలలో సీట్ అలాట్ అయ్యేటట్లు చేశాడని వాపోయారు. దీంతో తాము నష్టపోయామని, తమలాగే 30 మందికి పైగా విద్యార్థులను మోసగించాడని తెలిపారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించండి


వృద్ధురాలి సమస్య వింటున్న జేసీ రోణంకి కూర్మనాథ్

• జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవితో కలిసి జేసీ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సంబంధిత శాఖల జిల్లా అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ మళ్లీ రాకుండా సమస్యను పరిష్కరించేలా సత్వరమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో నేతలు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం జేసీకి అందజేశారు. కండలేరు డ్యాం ఎడమ కాలువ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించి రైతాంగానికి నీరు అందించాలంటూ బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ వినతిపత్రం సమర్పించారు. కలువాయి మండలం చింతలపాళెం గ్రామానికి చెందిన కొల్లా వెంకయ్య ఆ గ్రామ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటకుండానే రూ.15 లక్షలు ఉపాధి నిధులు స్వాహా చేశారంటూ జేసీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మెప్మా, ఐసీడీఎస్ పీడీలు రవీంద్ర, హేనా సుజన, ఐటీడీఏ పీఓ మందా రాణి, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, డీటీడబ్ల్యూఓ పరిమళ, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒకే రోజు ఆరు ఆలయాల్లో చోరీ

• నగలు, నగదు అపహరణ


చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దుత్తలూరు: ఒకే రోజు ఒకే పంచాయతీలో ఆరు ఆలయాల్లో చోరీలు జరిగిన ఘటన సోమవారం దుత్తలూరు మండలంలో కలకలం రేపింది. దుండగులు వరుసగా ఆరు ఆలయాల్లో హుండీల్లోని నగదుతోపాటు నగలు అపహరించారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని బోడవారిపల్లి పంచాయతీలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరగ్గా సోమవారం స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించారు. బోడవారిపల్లి, మందాలనాయుడుపల్లి గ్రామాల్లో దాదాపు 12 ఆలయాలు ఉన్నాయి. గుర్తుతెలియని దుండగులు ఆదివారం రాత్రి ఆయా గ్రామాల సమీపంలో ఉన్న శివాలయం, వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లి, వీరబ్రహ్మేంద్రస్వామి, వినాయకుడు, ఆంజనేయస్వామి ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. శివాలయంలో అమ్మవారి మంగళసూత్రాలతోపాటు పోలేరమ్మ ఆలయంలో అమ్మవారి ముక్కుపుడకను అపహరించారు. అలాగే అన్ని ఆలయాల్లోని తలుపులతోపాటు హుండీలు పగలగొట్టి నగదు దోచుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. హుండీల్లో సుమారు రూ.లక్ష నగదు ఉండవచ్చని భావిస్తున్నారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ప్రభాకర్ తన సిబ్బందితో కలిసి చోరీలు జరిగిన ఆలయాలను పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు నమోదు చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.